# [illegible]

ఏ రోజు మా ఆఫీసుకు క్రొత్త ఆఫీసరు వస్తున్నారనగానే మా ఆఫీసు స్వరూపమే మారిపోయింది.

ఎక్కడచూసినా 'డిసిప్లిన్'తాండవించింది.

ఆఫీసులో చాలా మంది కొత్త పెళ్ళికొడుకుల్లా తయారయి వచ్చారు.

పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి.

కొంతమంది మాత్రం వచ్చే క్రొత్తాఫీసరు గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

ఆయన శాంతస్వభావుడని కొంతమంది - కాదు చండశాసనుడని కొంతమంది 'బెట్' వేసుకుంటూ కూర్చున్నారు.

ఇంతలో క్రొత్తాఫీసరుగారు రానేవచ్చారు.

ఆఫీసరు గారి గదిలోకి అందరిని పేరు పేరునా పిలిపించుకుని పరిచయం చేసుకున్నారు.

పరస్పర పరిచయాలయ్యాక మేమంతా మా సీట్లలో వచ్చి కూర్చున్నాము.

'ఫర్వాలేదు మనిషి మంచివాడిలాగే కన్పిస్తున్నాడు' అని ఒక అభిప్రాయానికి వచ్చాము మేమంతా.

కాని ఆ అభిప్రాయం ఎంతోసేపు నిలవలేదు.

కారణం-

మా ఆఫీసు జీపుడ్రైవరు రాముడు కూడా ఆయనగార్కి ఓ నమస్కారం పెట్టి పరిచయం చేసుకు రావడానికి ఆయన గదిలోకి వెళ్ళాడు. కాని అక్కడ ఏమి జరిగిందో కాని- కొద్దిసేపయిన తర్వాత ఆ రూమ్‌లోంచి ఆఫీసరుగారు జీపుడ్రైవర్‌పై పెద్దగా కేకలు వెయ్యటం విన్పించింది.

'యూ బ్లడీఫూల్ డోన్ట్ షో యువర్ బ్లడీ ఫేస్ గెటవుట్' అని ఇంగ్లీషులో అరవటం విన్పించి, మేమంతా కిక్కురమనకుండా ఉండిపోయాము.

పాపం' కొద్ది సేపయిన తర్వాత ఆ డ్రైవర్ బిక్కమొహంతో బయటికి రావటం చూశాము.

కారణము ఏమిటని అడగ్గా- ఏమీ లేదని బయటికి వెళ్లిపోయాడు.

ఆ రోజే కాదు- ఆ జీపుడ్రైవరు ఆయన కంటపడినప్పుడల్లా- అలా మండి పడుతూనే ఉన్నారు.

దానిక్కారణము మాకు అర్థం కావటం లేదు.

* * *

రోజులు గడిచిపోతున్నాయ్.

మా ఆఫీసుకు ఏ క్రొత్తాఫీసరు వచ్చినా- అతని జాతకమంతా తెలుసుకోవడం మా రివాజు. ఆ డ్యూటీ మా అకౌంటెంట్ ఆనందరావుది.

ఆ సాయంకాలమే మా ఆనందరావు మా ఆఫీసరు గురించి వార్తలను సేకరించుకుని వచ్చాడు.

మా ఆఫీసరు గారి భార్య ఎవరితోనో లేచిపోయిందని- ప్రస్తుతం ఆయన ఓ అద్దె ఇంట్లో తన నల్గురు పిల్లలతో ఉంటున్నారన్న విషయం తెలిసింది.

ఆ వార్త మమ్మల్ని దిగ్భ్రాంతిని కలిగించింది.

'అయ్యోపాపం' అనుకున్నాము.

* * *

ఆ రోజు మా ఆఫీసుకు డాక్టర్ రావు గారు వచ్చారు ఏదో పనిమీద. ఆయన వస్తూనే మా ఆఫీసరు గారితో ఏదో ముచ్చటిస్తూ కూర్చున్నారు.

అలా కొద్దిసేపు గడిచిన తర్వాత డాక్టరు గారు ఏదో గుర్తుకు వచ్చినట్టు- బయట జీపులో కూర్చుని ఉన్న తన డ్రైవర్ని పిలిపించి- జీపులో ఫైళ్లని పట్టుకురమ్మని పురమాయించారు.

ఆ జీపు డ్రైవరు వెళ్లి- జీపులోని ఫైళ్లు తెచ్చి మా ఆఫీసరు టేబుల్‌పై పెట్టి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. అంతే! మరుక్షణంలోనే మా ఆఫీసరు పూనకం వచ్చినట్టు ఆ జీపు డ్రైవర్‌పై విరుచుకుపడ్డారు.

అతనిపై తిట్ల వర్షం కురిపించారు.

అకారణమైన ఈ తిట్లదాడికి తట్టుకోలేక ఆ డ్రైవర్ ఉక్కిరిబిక్కిరయ్యాడు.

మా ఆఫీసరు ఆవేశంలో ఊగిపోతున్నారు.

మనిషి నిలువెల్లా గజగజా వణికిపోతున్నారు.

మేమంతా ఆయనని కంట్రోలు చెయ్యలేకపోయాము.

ఈ హఠాత్సంఘటనకి బిక్కచచ్చిపోయిన డా. రావు గారు తన డ్రైవర్ని తీసుకుని మెల్లగా

అక్కణ్ణుంచి జారుకున్నారు.

* *

ఒరేయ్! ఆనందరావు! ఇందులో ఏదో లిటిగేషన్ ఉందిరా. మన ఆఫీసర్ గార్కి జీపు డ్రైవర్లంటేనే అలర్జిలా ఉందేయ్. ప్రతి జీపు డ్రైవర్ని చూసినప్పుడల్లా ఈయన ఇలా హిస్టీరిక్‌గా ప్రవర్తించటం వింతగా లేదు. ఈ రహస్యం కొంత తెలుసుకుంటే నీకు అజన్మాంతమూ ఋణపడి ఉంటాము గురూ అని వేడుకున్నారందరూ ఆ రోజు ఆఫీసులో మా ఆనందరావుని.

అతను చిద్విలాసంగా నవ్వుతూ- ఆ కార్యం సాధించటానికి- బయలుదేరాడు.

మేమంతా టెన్షన్ భరిస్తూ గడిపాము.

ఆ మరుసటి రోజే ఆనందరావు ఏదో నిధి రహస్యం తెలుసుకున్నట్లు వెలిగిపోతున్న మొహంతో వచ్చాడు.

అతను మమ్మల్ని కొద్దిసేపు సస్పెన్స్‌లో ఉంచి చివరికి చెప్పిన విషయం ఇది-

'మన ఆఫీసరు గార్కి జీపుడ్రైవర్లంటే ఎందుకు గిట్టదో తెలుసా? ఎందుకంటే-

ఆయనగారి పెళ్ళాం లేచిపోయింది ఓ జీపు డ్రైవర్‌తోనేనట!'

*



## భావ్యం...కాదూ

"నీ ఆస్తిమొత్తం నీ మూడవ కొడుక్కే వ్రాసేసావట. అది భావ్యంగా వుందా? మిగతా ఇద్దరి మాటేమిటి?"

"మొదటివాడు చిన్నప్పటి నుండీ బుద్ధిగా తిరిగి రాజకీయాల్లో చేరాడు. వాడు ఫరవాలేదు. రెండవ వాడు బొంబాయి పోయి స్మగ్లింగ్ అదీ చేస్తున్నాడు. వాడూ ఫరవాలేదు. పాపం మూడవవాడే కష్టపడి చదివి డిగ్రీ పూర్తిచేసాడు...ఎలా బ్రతకడు-అందుకే"

- కె.వి.మధుసూదనరావు

## అదైతే వంద!

"మీ టైపిస్టును చూస్తే ఎందుకో అంత మంచిది కాదనిపిస్తోంది" అన్నాడు టైప్ చేయించుకో వచ్చిన శ్రీను.

"అదేం?" అడిగాడు ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్.

"మాట్లాడితే చాలు. హయ్యరుకు లోయరుకు రెండొందల వంద. అంటోంది" చెప్పాడు శ్రీను.

పద్మశ్రీ(మాణిక్యారం)

## ప్రకటన!

"నిన్న సాయంత్రం బీచ్ ఒడ్డున, సినిమా హాలులోనూ తిరిగిన ప్రేమికుల జంటను మా విలేకరులు పసిగట్టారు. వారు రేపటిలోగా మా పత్రికకు చందాదారులు కాకపోతే వారి పేర్లు పేపర్లో ప్రకటించేస్తాం"

అంతే! తరువాత రోజు ఆ పత్రిక సర్క్యులేషన్ ఓ పదివేలు పెరిగింది.

- కే.వి.మధుసూదనరావు